క్లుప్తంగా

ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు



• వైద్యాధికారి శిరీష

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కిలగాడ వైద్యాధికారిణి శిరీష తెలిపారు.మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని బంగారుమెట్ట,దారెల,జర్జుల,కిలగాడ,పెదగూడ గ్రామాలకు సంబంధించి ఆశా కార్యకర్తల ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 18వ తేదీ లోపు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని,ఒక్కొక్క గ్రామం నుంచి గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య కమిటీ(వీహెచ్‌ఎస్‌ఎన్‌సీ) ఆమోదం తెలిపిన మూడు దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని ఆమె కోరారు.

క్షయ రోగులకు సకాలంలో మందులు పంపిణీ చేయాలి

గూడెంకొత్తవీధి: క్షయరోగులకు సకాలంలో మందులు పంపిణీ చేసి, వారి ఆరోగ్య పరిస్థితి ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా క్షయ, కుష్ఠు నియంత్రణ అధికారి,ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం. కిరణ్ కుమార్ సూచించారు.ఆయన మంగళవారం జెర్రెల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో క్షయతో బాధపడుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు.క్షయ రోగులకు వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స చేయాలని సూచించారు. పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీపై ఎప్పటికప్పుడు వైద్యులతో సహా అంతా పర్యవేక్షించాలని తెలిపారు. క్షయ లక్షణాలు కలిగిన అనుమానితులు ఎవరున్నా వారి నుంచి శాంపిల్స్ తీసుకుని పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు మణిదీప్,సీహెచ్‌వో మురళీ,గూడెం టీబీ ఎస్‌టీ అశోక్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



వెంకటరావుకు సపర్యలు చేస్తున్న ప్రయాణికులు

అనంతగిరి(అరకులోయటౌన్): విశాఖ-అరకు ఘాట్‌రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అరకులోయ మండలం పప్పుడువలస గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు వెంకటరావు , ప్రవీణ్ స్కూటీపై విశాఖ వెళ్తుండగా ఘాట్‌రోడ్డులోని ఏసుక్రీస్తు బొమ్మ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి స్కూటీ బోల్తా పడింది. ఈ సంఘటనలో వెంకటరావుకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నంలో ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల తనిఖీ



లక్కొండ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మల్లేశ్వరరావు

గంగవరం : విద్యార్థులు క్రమంతప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి-2 టి.మల్లేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. లక్కొండ గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, పిల్లల హాజరు, పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం కె.రఘుబాబు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు తాటాకు ఇళ్లు దగ్ధం



అగ్ని బాధితులకు సాయం అందజేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం: మండలంలోని బయ్యనపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పాతర మల్లమ్మ, పాతర లక్ష్మిలకు చెందిన రెండు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. దీంతో ఆ రెండు గిరిజన కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు గ్రామస్తులు తెలిపారు. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తరుపున ఎస్‌ఐ వెంకటేష్ రూ.ఐదువేల చొప్పున ఆర్థిక సాయం, నిత్యావసర సరకులు అందజేశారు.

కాబోయే అమ్మకు కష్టాల వసతి



చింతపల్లిలో గర్భిణుల వసతి గృహం

• చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో సౌకర్యాలు కరువు
• విద్యుత్ సరఫరా నిలిచి పోతే అంధకారంలో మగ్గాల్సిందే
• తాగునీటికీ తప్పని ఇబ్బందులు • చినుకుపడితే చిత్తడే

గిరిజన గర్భిణులు వైద్యానికి, ప్రసవానికి ఆస్పత్రికి రావాలంటే కొండలు ఎక్కి గుట్టలు దిగి చాలా దూరం ప్రయాణించాలి... ఈ పరిస్థితుల్లో ఒక్కోసారి గర్భం పోవడంతో పాటు, తల్లీబిడ్డలకు ప్రమాదం పొంచి ఉంటుంది. దీనిని గమనించి ప్రభుత్వం గర్భిణులకు వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడడంతో కనీస వసతులు లేక గర్భిణులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో ఉన్న వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేక గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాతా శిశు మరణాలను నివారించేందుకు జిల్లాలో పలు ప్రాంతాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలతో గర్భిణుల వసతి గృహాలను ఏర్పాటు చేశారు. మారుమూల గ్రామాలకు చెందిన గర్భిణులను ప్రసవానికి పది రోజుల ముందుగా ఇక్కడికి తరలించి, సకాలంలో వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. గర్భిణులతో పాటు సహాయకునికి కూడా మూడు పూటలా వసతి, భోజన సౌకార్యాలను ఏర్పాటు చేశారు. చింతపల్లిలో గల కల్యాణ మండపంలో ఈ వసతి గృహాన్ని ప్రారంభించారు. 10 బెడ్లు,ఫ్యాన్లు,తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. అన్ని వేళలా వైద్యసేవలందించేందుకు ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇద్దరు వాచ్‌మెన్‌లు, ఒక ఆయాను అందుబాటులో ఉంచారు.

నెలకు 20 మంది ...

చింతపల్లి,జీకే వీధి మండలాల్లోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గర్భిణులు ప్రసవానికి పది రోజులు ముందుగానే వసతి గృహంలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల వసతి గృహంలో చేరడానికి గర్భిణులు ఆసక్తి చూపుతున్నారు.ప్రతి నెల 15నుంచి 20 మంది వరకూ గర్భిణులు ఇక్కడ చేరుతున్నారు.

మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్

వసతి గృహంలో గర్భిణల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ మూలకు చేరింది. మరమ్మతులకు గురై ఏడాది కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో గర్భిణులు తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికంగా ఉన్న పెద్దపైపు(ఊటగెడ్డ)నుంచి రోజూ నీటిని తెచ్చుకోవలసి వస్తోంది.పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని గర్భిణులు తెలిపారు.



వసతి గృహంలో ఉన్న రెండే మరుగుదొడ్లు

విద్యుత్ సరఫరా ఆగితే అంధకారమే

ఈ వసతి గృహానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతే గర్భిణులు అంధకారంలో మగ్గిపోవలసిందే. మండలకేంద్రం చింతపల్లిలో ఏ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే కొవ్వొత్తుల వెలుగులో గడపాల్సిందే. ఒక వైపు అంధకారం, మరో వైపు దోమల బెడదతో గర్భిణులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

రెండే మరుగు దొడ్లు

వసతిగృహంలో రెండే మరుగుదొడ్లు ఉండడంతో నానా అవస్థలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికే వసతిగృహం పూర్తిగాకారిపోయి చిత్తడిగా మారుతోంది.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యల పరిష్కారానికి చర్యల చేపట్టాలని గర్భిణులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన మినరల్ వాటర్ ప్లాంటు

అధికారులకు దృష్టికి తీసుకువెళ్లాం

గర్భిణుల వసతి గృహంలో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాం.వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ఇబ్బంది కలగకుండా ఇన్వర్టర్ సౌకర్యం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిధులు మంజూరు కాగానే సమస్యలు పరిష్కారాని కృషి చేస్తాం.

– డాక్టర్ ఇందిరా ప్రియాంక, సూపరింటెండెంట్ ఏరియా ఆస్పత్రి,చింతపల్లి

హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఏఎంవో భాస్కర్

అడ్డతీగల: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని జిల్లా అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ కె.భాస్కర్ అన్నారు.స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 11 మండలాలకు చెందిన 200 మంది హెచ్‌ఎంలకు వేటమామిడి హోసన్నా విద్యాసంస్థల ప్రాంగణంలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఏఎంవో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు స్వీయ అవగాహన,స్వీయ నిర్వహణ,కమ్యునికేషన్ ప్రభావం, ఆర్థిక వనరులు డేటా ఆధారిత సూచనలు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.సోమవారం ప్రారంభమైన శిక్షణ ఈనెల 17 వరకూ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎంఈవో పి.శ్రీనివాసరావు,మాస్టర్ ట్రైనర్స్ పి.రాజు, ఎ.సత్తిరాజు,పి.రాజారావు,సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెం పాఠశాల సందర్శన

గంగవరం : వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి సూచించారు. మంగళవారం సూరంపాలెంలో పర్యటించిన ఆమె ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో సమస్యలను హెచ్‌ఎం సాయిబాబా ఎమ్మెల్యేకు వివరించారు.

ఉపాధి ఈసీపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన వేతనదారులు



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న వేతనదారులు

రాజవొమ్మంగి: ఉపాధిహామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కన్సల్టెంట్(ఈసీ) రాజుబాబు తమను వేధింపులకు గురిచేస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వేతనదారులు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సరిగా మస్తర్లు వేయడంలేదని, సంతకాలు పెట్టడం లేదని ఆరోపించారు. ఈసీ కారణంగా కష్టపడి పని చేసిన చాలా మంది వేతనదారుల మస్తర్లు గల్లంతు అవుతున్నాయని, ఫారంపాండ్స్ మంజూరుకు ఈసీ లంచం అడుగుతున్నాడని ఆరోపించారు. వేతనదారులపట్ల ఈసీ అమర్యాదగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈసీపై పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని స్థానిక ఎంపీడీవో యాదగిరీశ్వరరావును ప్రశ్నించారు. ఈసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో వినతిపత్రం అందజేశారు. సుమారు వెయ్యి మంది వేతనదారులు ఒకేసారి రావడంతో కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతానని ఎంపీడీవో వారికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు. వేతనదారులకు స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి బాసటగా నిలిచి ధర్నాలో పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు... విద్యార్థులకు అవస్థలు



పాఠశాల భవనం పూర్తి చేయాలని వేడుకుంటున్న గ్రామస్తులు

పాడేరు రూరల్: మండలంలో మారుమూల సలుగు పంచాయతీ లోలంగిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ రాజారావు,విద్యార్థుల తల్లిదండ్రులు నాగేశ్వరరావు,దాసు తదితరులు మంగళవారం మాట్లాడుతూ భవనం అసంపూర్తిగా ఉండటంతో పాఠశాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు ఇచ్చినా భవన నిర్మాణం పూర్తి కాలేదన్నారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, భవన నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుభాష్‌చంద్ర

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సర్పంచ్ సీసా సుభాష్ చంద్ర అన్నారు.మండలంలో కించాయిపుట్టు సచివాలయం వద్ద మంగళవారం గిరిజన రైతులకు రాగి విత్తనాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ సుభాష్‌చంద్ర చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయశాఖాధికారుల సూచనలు పాటించాలని,కాలానికి అనుగుణంగా పంటలు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది తరుణ్,గిరిజన రైతులు పాల్గొన్నారు.



జి.మాడుగులలో రాగి విత్తనాలు అందజేస్తున్న ఏవో వరప్రసాద్, సర్పంచ్‌లు రాంబాబు, కొండబాబు

రాగి విత్తనాల పంపిణీ

జి.మాడుగుల: స్థానిక సచివాలయం-1లో మంగళవారం రాగి(చోళ్ల) విత్తనాలను మండల వ్యవసాయాధికారి కె.వరప్రసాద్, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100శాతం సబ్సిడీపై అందించటానికి మండలంలో 315 రాగి విత్తనాల కిట్లు స్థానిక వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచినట్టు తెలిపా రు. మినీ కిట్ల రూపంలో రాగి విత్తనాలు సరఫరాకు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజు మాస్టర్ సేవలు ఎనలేనవి



ఉపాధ్యాయుడు రాజును సన్మానిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: రాజు మాస్టర్ విద్యార్థుల పట్ల చూపిన అభిమానం,పాఠశాలకు అందించిన సేవలు ఎనలేనివని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బలరాం అన్నారు.మండలంలో దారెల పంచాయతీ పేటమాలిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 8 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళుతున్న సమరెడ్డి రాజును విద్యార్థులు,గ్రామ గిరిజనులు మంగళవారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బలరాం మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం పని చేసే ఉపాధ్యాయులకు బదిలీఅవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్, ఉపసర్పంచ్ మధుబాల,ఉపాధ్యాయలు పద్మసేన్, అప్పలస్వామి,పార్వతి,ఇంద్రావతి,వి.ఆర్.పి.రుక్మాందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

రంపచోడవరం: ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్యను పెంచాలని రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ ,సోషల్ మీడియా కన్వీనర్ రాపాక సుధీర్ రాజ్ కోరారు. రంపచోడవరంలోని ఆధార కేంద్రం సిబ్బంది సకాలంలో హాజరుకాకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఎన్ని సార్లు వెళ్లినా పనులు జరగడం లేదన్నారు. అధికారులు స్పందించి ప్రతి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కోరారు.

పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై నిఘా



ముంచంగిపుట్టులో దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని ఎస్‌ఐ జె.రామకృష్ణ తెలిపారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాల్లో ఎస్‌ఐ తనిఖీలు నిర్వహించారు.పలు దుకాణాల్లో పొగాకు అమ్మకాలు జరుగుతున్నట్టు గుర్తించి, జరిమానా విధించారు. పాఠశాలల సమీప ప్రదేశాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు.



జడ్డంగిలో దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చినబాబు

రాజవొమ్మంగి : ఆపరేషన్ సేఫ్ జోన్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా జడ్డంగిలోని విద్యాలయాల చుట్టుపక్కల గల దుకాణాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేసినట్టు ఎస్‌ఐ చినబాబు తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా పాఠశాలలకు సమీపంలోని దుకాణాల్లో విక్రయిస్తున్న సరకులను తనిఖీ చేశామన్నారు. గుట్కాలు, సిగరెట్లు అమ్మవద్దని హెచ్చరించినట్టు చెప్పారు.

శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి..



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని స్థానిక ఎస్‌ఐ పాపినాయుడు అన్నారు. కిల్లోగుడ బాలుర ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, పొగాకు వంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై డుంబ్రిగుడ మూడు రోడ్ల జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి



పెద్దపుట్టు పాఠశాలలో విద్యార్థితో చదివిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు: విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందించాలని మండల విద్యాశాఖాధికారి కె.కృష్ణమూర్తి అన్నారు.మండలంలో కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు,జర్జుల పంచాయతీ సింధిపుట్టు,బలడలలో మండల పరిషత్,జీపీఎస్ పాఠశాలలను ఎంఈవో మంగళవారం సందర్శించారు.విద్యార్థులతో మాట్లాడి వారి వర్క్ బుక్స్‌ను పరిశీలించి,తప్పులను సరిదిద్దారు. బ్లాక్ బోర్డుపై లెక్కలను బోధించి, విద్యార్థులతో చేయించారు. పలుప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు తప్పని సరిగా నమోదు చేయాలని,ఆన్‌లైన్ పనులను సైతం వెంటనే పూర్తి చేయాలని,లెసన్ ప్లాన్,ఇయర్ ప్లాన్ డైరీలను కచ్చితంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

286 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



తీగలవలసలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ కేంద్రంలో జాయ్ ఫర్ ఆల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో మంగళవారం నిర్వహించిన నేత్రవైద్య శిబిరంలో 286 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తీగలవలస,తడిగిరి పంచాయతీల పరిధిలోని గిరిజనులు ఈ శిబిరంలో వైద్యసేవలు పొందారు. 40మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశామని, 27మందిని శస్త్రచికిత్స కోసం విశాఖకు తరలించనున్నామని ట్రస్ట్ చైర్మన్ జాన్‌వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,ట్రస్ట్ సిబ్బంది జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

చింతూరు: తాగునీరు, రహదారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని కల్లేరు సచివాలయం ఎదుట మహిళలు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి బోర్లు మరమ్మతులకు గురై కలుషిత నీరు వస్తోందని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రధాన రహదారికి వెళ్లేందుకు ఉన్న గ్రామంలోని అంతర్గత రహదారి దెబ్బతిని గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో సోడె చిన్నమ్మి, రాములమ్మ, కమలమ్మ, బుచ్చమ్మ, రాజమ్మ, జోగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి



మండల కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణ

చింతపల్లి: మండలంలో అర్హులైన పేదలు ఇళ్ల కోసం మండల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు టి.రామకృష్ణ తెలిపారు.మంగళవారం కార్యాలయంలో కార్యదర్శులు,గ్రామ రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే ఈకేవైసీ చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలో గల అన్ని గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించడంతో పాటు వారు ఇంటి కోసం దరఖాస్తు చేసుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ ,విఆర్‌ఓలు కార్యదర్శులు పాల్గొన్నారు.